

## రోడ్డుకు అడ్డంగా మర్రిచెట్టు కొమ్మ


రోడ్డుకు అడ్డంగా ఉన్న కొమ్మ

జంగారెడ్డిగూడెం టౌన్ : మూడు రోజుల క్రితం వీచిన ఈదురుగాలులకు జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం వెళ్లే రోడ్డులో నూకాలమ్మ ఆలయ సమీపంలో పెద్ద మర్రి చెట్టు కొమ్మ రోడ్డుకు అడ్డంగా విరిగిపడింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్టు కొమ్మ విరిగిపడి మూడు రోజులవుతున్నా, అప్పటి నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చెట్టు కొమ్మను తొలగించేందుకు చర్యలు తీసుకోవడంలేదని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై విరిగిపడిన మర్రి చెట్టు కొమ్మను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఆక్వాకు విద్యుత్ రాయితీ ఎప్పుడో..!



- ఏలూరు, పశ్చిమ జిల్లాల్లో 3 లక్షల ఎకరాల్లో సాగు
- ఆక్వాకు యూనిట్‌కు రూ.1.50కు విద్యుత్ ఇస్తామని కూటమి హామీ
- రెండు జిల్లాల్లో లక్ష ఎకరాల్లో రైతులకు లబ్ధి చేకూరే అవకాశం
- తొలి కేబినెట్ సమావేశంలో నిర్ణయం జరిగేనా
- హామీ అమలుపై ఆక్వా రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఆక్వా సాగుకు విద్యుత్ రాయితీ అమలుపై రైతులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఎప్పటి నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తారనే చర్చ ఆక్వా రైతుల్లో సాగుతోంది. తొలి కేబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం ఉంటుందా అనే ఉత్కంఠ రైతుల్లో నెలకొంది. ఇప్పటికిప్పుడు ప్రభుత్వంపై ఆర్థిక భారం పడే అవకాశం లేకపోవడంతో ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. ఏలూరు జిల్లాలో లక్షా 85 వేల ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో లక్షా 30 వేల ఎకరాలు మొత్తం 3.15 లక్షల ఎకరాల్లో రైతులు ఆక్వాసాగు చేస్తున్నారు. సాగులో మూడొంతులు రొయ్యల సాగే ఉంది. రొయ్యలు, చేపల సాగు చేసే రైతులు కరోనా దగ్గర నుంచి తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. సరైన ధర లేకపోవడం, మేత ధరలు పెరిగిపోవడం వంటి అంశాలు ఆక్వా రైతులను నిలువునా దెబ్బతీస్తున్నాయి. 2019 ఎన్నికల్లో ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ రాయితీ ఇస్తామని వైసిపి ప్రకటించింది. తర్వాత ప్రభుత్వం నిబంధనలను తెరపైకి తెచ్చింది. ఆక్వా జోన్‌లో ఉండి, పదెకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే విద్యుత్ రాయితీ వర్తిస్తుందని నిబంధన తీసుకొచ్చింది. దీనిపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. రొయ్యల సాగులో నిరంతరం ఏరియేటర్లు తిప్పాల్సి ఉంటుంది. దీనికి పెద్దఎత్తున విద్యుత్ ఖర్చవుతోంది. విద్యుత్ రాయితీ ఇవ్వకపోవడంతో చాలామంది రైతులు పెద్దఎత్తున విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఆక్వా సాగు సంక్షోభంలో కూరుకుపోయింది, నిబంధనలతో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయాలని కోరినా వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే పరిస్థితుల్లో తాము అధికారంలోకి వస్తే గత టిడిపి ప్రభుత్వ హయాంలో అమలు చేసినట్లుగానే ఆక్వా రైతులందరికీ యూనిట్ రూ.1.50కు విద్యుత్ ఇస్తామని టిడిపి ప్రకటించింది. జిల్లాలో పర్యటించిన ప్రతిసారీ టిడిపి అధినేత చంద్రబాబు, యువగళం యాత్రలో లోకేష్ సైతం రైతులకు హామీ ఇచ్చారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఇదే అంశాన్ని పొందుపరిచారు. ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచి కూటమి ప్రభుత్వం ఏర్పడింది. దీంతో ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ ఎప్పటి నుంచి వర్తింపచేస్తారనే చర్చ మొదలైంది. దీనికి ప్రత్యేక కారణం ఉంది. ఆక్వా సాగులో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. జిల్లా నుంచి ప్రతియేటా వేల టన్నుల ఆక్వా ఉత్పత్తులు జిల్లా నుంచి ఎగుమతి అవుతున్నాయి. జిల్లాలో అతిపెద్ద సాగుగా ఆక్వా ఉంది. రాష్ట్రానికి విదేశీ మారక ద్రవ్యం సైతం ఆక్వా నుంచి వస్తోంది.

### 3 వేలకు పైగా విద్యుత్ సర్వీసుల పరిధిలో రైతులకు లబ్ధి

వైసిపి ప్రభుత్వం పదెకరాలలోపు ఆక్వా రైతులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయడంతో చాలామంది రైతులు సబ్సిడీ ఊరట దక్కని పరిస్థితి నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లాలో లక్షా 30 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా మొత్తం 16 వేల వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 13 వేల విద్యుత్ కనెక్షన్లకు యూనిట్ రూ.1.50 విద్యుత్ రాయితీ వర్తిస్తోంది. ఇంకా మూడువేల కనెక్షన్లకు విద్యుత్ రాయితీ అందని పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో 13 వేల వరకూ ఆక్వా విద్యుత్ సర్వీసులు ఉండగా దాదాపు 85 శాతం సర్వీసులకు విద్యుత్ రాయితీ వర్తిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా 300 విద్యుత్ సర్వీసులకు విద్యుత్ రాయితీ వర్తించడంలేదని తెలుస్తోంది. రెండు జిల్లాల్లో కలిపి దాదాపు 3,300 ఆక్వా విద్యుత్ సర్వీసులకు రాయితీ వర్తించడం లేదని లెక్కలు చెబుతున్నాయి. ఈ సర్వీసుల పరిధిలో దాదాపు లక్షలాది ఎకరాల్లో ఆక్వా సాగు ఉండొచ్చని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నిబంధనలతో సంబంధం లేకుండా జిల్లాలోని అన్ని ఆక్వా విద్యుత్ సర్వీసులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ రాయితీ ఇవ్వాల్సి ఉంది. ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. ఇది ఎప్పటి నుంచి అమలు చేస్తారో వేచిచూడాలి.

# నీట్ పరీక్షల్లో అవకతవకలపై విచారణ జరిపించాలి

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఏలూరు అర్బన్ : దేశవ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వస్తున్న దృష్ట్యా దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని గ్రాండ్ ఆర్య హోటల్ వద్ద విద్యార్థులతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ నీట్ యుజి 2024 ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడం తో ఎన్నో అనుమానాలు వస్తున్నాయని, అదే సెంటర్‌లో పరీక్ష రాసిన విద్యార్థి జాన్వీ 179 ప్రశ్నలను అటెంప్ట్ చేయగా అందులో 163 కరెక్ట్ అయ్యాయని, ఆమెకు 636 మార్కులు రావాల్సి ఉండగా 720/720 ఎలా వచ్చాయని ప్రశ్నలు లేవనెత్తుతున్నాయన్నారు. ఈ నీట్ ఎగ్జామ్ వివాదంపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వివరణ ఇస్తూ పరీక్షలో సమయం కోల్పోయినట్లు నిర్ధారించిన అభ్యర్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్ల 718, 719 మార్కులు వచ్చాయని, ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉండటంవల్ల రెండు ఆప్షన్లు సరైనవిగా ప్రకటించి 44 మంది అభ్యర్థుల మార్కులు 715 నుంచి 720కి పెరిగాయని వివరణ ఇచ్చిందని చెప్పారు. కానీ కొంత మంది విద్యార్థులకు వందకు పైగా గ్రేస్ మార్కులు కలిపినట్లు తెలుస్తోందన్నారు. అలాగే ఈ నెల 14వ తేదీన ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించి, ఎన్నికల కౌంటింగ్ రోజున పరీక్షా ఫలితాలు విడుదల చేయటంతో ఎన్నో సందేహాలు లేవనెత్తాయన్నారు. ఏలూరు పట్టణ నాయకులు మహర్షి, బి.మనోజ్, వంశీ పాల్గొన్నారు.

# ఏలూరు, పశ్చిమ కలెక్టర్ల బదిలీ

### ఏలూరు కలెక్టర్‌గా వెట్రిసెల్వి
### పశ్చిమ కలెక్టర్‌గా నాగరాణి


ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి


పశ్చిమ కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను బదిలీ చేస్తూ సాధారణ పరిపాలనా విభాగంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్న కె.వెట్రిసెల్విని ఏలూరు జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను చిత్తూరు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్న సి.నాగరాణి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. రెండు జిల్లాలకు మహిళలు కలెక్టర్లుగా నియమితులు కావడం విశేషం.

# జీలుగుమిల్లి, ద్వారకాతిరుమల ఎపిఒలపై చర్యలు తీసుకోవాలి

### డ్వామా పీడీకి వ్యవసాయ కార్మిక సంఘం నేతల వినతి


డ్వామా పీడీకి వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దెందులూరు, పెదవేగి మండలాల్లో ఉపాధి హామీ పనులు నిలిపివేయడంతో కూలీలు నానావస్థలు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డ్వామా అధికారులపై మండిపడ్డారు. బుధవారం జిల్లా డ్వామా కార్యాలయంలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డ్వామా పీడీ ఎ.రాముకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఒకపక్క అవినీతి అక్రమాలకు నిలయంగా ఉపాధి హామీ కార్యాలయాలు మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అన్ని మండలాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతుంటే దెందులూరు, పెదవేగి మండలాల్లో ఉపాధి హామీ పనులు ఎందుకు నిలిపివేశారని అధికారులను నిలదీశారు. పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు వారి సమస్యలను అధికారులకు విన్నవించుకోవడానికి వస్తే కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పని ప్రదేశాల్లో కల్పించాల్సిన సౌకర్యాలు కల్పించకపోవడంతోపాటు ఇలా పనులు నిలిపివేయడం వల్ల ఉపాధి కార్మికులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఒకపక్క అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన ఉపాధి హామీ కార్యాలయాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. జీలుగుమిల్లి మండలంలో ఎపిఒపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పి.అంకంపాలెం, దర్భగూడెం తాటాకులగూడెం, జీలుగుమిల్లి గ్రామాల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు లేరని తెలిపారు. అయినా వారి పేర్లతో జీతాలు డ్రా చేసుకుని సొమ్ము స్వాహా చేస్తున్న ఎపిఒపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ద్వారకాతిరుమల మండలం తిరుమలపాలెం, నారాయణపురం, పంగిడిగూడెం, గుణ్ణంపల్లి, బుట్టాయగూడెం గ్రామాల్లో పనికి రాని వారికి మస్టర్ వేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై మండల స్థాయి ఎపిఒ చూసీచూడనట్టు వ్యవహరించడంతో దిగువస్థాయిలో అవినీతి పెరిగిపోతుందని మండిపడ్డారు. దీని వెనుక ఎపిఒ, మండలస్థాయి అధికారుల హస్తం ఉందని తెలుస్తోందన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. ఇలాంటి అవినీతి తిమింగలాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డ్వామా పీడీ రాము మాట్లాడుతూ కింది స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవినీతికి పాల్పడుతున్న వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అన్ని మండలాల్లోనూ సమగ్రంగా ఉపాధి పనులు జరిగేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, జిల్లా సహాయ కార్యదర్శి రాజమండ్రి దానియేలు పాల్గొన్నారు.

# భద్రాచలంలో మాదేపల్లి బాలుడు మృతి

### గోదావరిలో స్నానం చేస్తుండగా ఘటన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

భద్రాచలం వద్ద గోదావరి స్నానానికి దిగి ఏలూరు శివారు మాదేపల్లికి చెందిన బాలుడు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మాదేపల్లిలోని ఇందిరా నగర్‌కు చెందిన అంగులూరి శ్రీను, సారమ్మ దంపతులకు ముగ్గురు సంతానం, సారమ్మ, ఆ తర్వాత శ్రీను మృతి చెందడంతో వారి సంతానంలో ఒకరైన కార్తీక్ తన మేనమామ కత్తి ఏడుకొండలు వద్ద ఉంటూ ఏడో తరగతి చదువుతున్నాడు. కార్తీక్ తన మేనమామ ఏడుకోండలు, చిన్న పెద్దమ్మ లక్ష్మీతో కలిసి ఆదివారం భద్రాచలం సరిహద్దుల్లోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక మండలంలోని శ్రీరామనగర్ కాలనీలో జరిగే పెళ్లి వేడుక కోసం వెళ్లారు. ఏడుకొండలు శనివారం ఉదయం భద్రాచలం వెళ్లారు. ఏడుకొండలుతోపాటు అంగలూరి కార్తీక్, ఖమ్మం జిల్లా రావణగుట్ట వికలాంగుల కాలనీకి చెందిన బొజ్జ మల్లికార్జున్, బొజ్జ రాములతోపాటు మరి కొంతమంది బంధువులు వెళ్లారు. వీరంతా గోదావరి స్నానానికి దిగారు. ఈ క్రమంలో స్నానం చేసి ఒడ్డుకు చేరుకుంటున్న సమయంలో కార్తీక్, బొజ్జ మల్లికార్జున్, రాజు నీటి ఒడిలో చిక్కుకుని కొట్టుకుపోతున్నారు. దీంతో అక్కడే ఉన్న ఫొటోగ్రాఫర్లు, జాలర్లు మల్లికార్జున, రాజును రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. కొద్దిసేపటికి కార్తీక్‌ను గుర్తించి ఒడ్డుకు తీసుకొచ్చారు. వెంటనే ముగ్గురిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కార్తీక్ మృతి చెందాడని నిర్ధారించారు. రాజు పరిస్థితి బాగానే ఉండటంతో డిశ్చార్జి చేశారు. మల్లికార్జునకు చికిత్స అందిస్తున్నారు.

# మలేరియా జ్వరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

విద్యార్థులు మలేరియా జ్వరాలపై అవాహన, అప్రమత్తత కలిగి ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. 'మలేరియా వ్యతిరేక మాసోత్సవ' కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏలూరు కెబిడిటి హైస్కూల్ విద్యార్థులకు మలేరియా జ్వరాలపై అవగాహన కల్పించారు. తీవ్ర జ్వరం, చలి, వణుకు, చెమటలు పట్టడం తదితర లక్షణాలు ఉంటే మలేరియా జ్వరం కావొచ్చని అనుమానించాలన్నారు. వారానికి ఒకసారి ఫ్రైడే డ్రై డే ఆచరించాలని,విద్యార్థులు కూడా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కార్యకర్త నాగ రంగమ్మ, మలేరియా హెల్త్ అసిస్టెంట్స్ మేక శ్రీనివాసరావు, సిహెచ్.రమేష్, ఆశా కార్యకర్త నాగరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చట్టాలపై మరింత విజ్ఞానం అవసరం

### న్యాయ అధికారుల వర్క్‌షాపులో రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్


మాట్లాడుతున్న కృష్ణమోహన్

ప్రజాశక్తి - ఏలూరు

చట్టాలపై న్యాయమూర్తులకు విజ్ఞానాన్ని మరింత పెంచడానికి న్యాయ అధికారుల వర్క్‌షాపులు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అధ్యక్షతన జిల్లాలోని న్యాయమూర్తులకు చట్టాలకు సంబంధించిన వివిధ అంశాలపై శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు జడ్జి, పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బి.కృష్ణమోహన్, రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎవి.శేషసాయి ఆధ్వర్యంలో న్యాయ అధికారుల వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ మాట్లాడుతూ న్యాయ అధికారులకు ప్రామిసరి నోట్ దావాలలో అమలు, పిటీషన్(ఈపి)పైన చట్టాలపై స్థూలమైన, విధానపరమైన ఎప్పటికప్పుడు అవసరమని భావించే ఇతర అంశాలపైన న్యాయ విజ్ఞానంతో సన్నద్ధం చేయడానికి వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వర్క్ షాపులో రిసోర్స్ పర్సన్ రిటైర్డ్ న్యాయమూర్తి, ఎపిఎటి మాజీ ఛైర్మన్ వైవి.రామకృష్ణ పాల్గొని ఎగ్జిబిషన్ ఆఫ్ డిగ్రీ ఫర్ ఎవిక్షన్ అండ్ డెలివరీ, డిటర్మినేషన్ అనే చట్టాలు ఎప్పటికప్పుడు మారుతున్న సవరణలపైన అవగాహనా సదస్సులో న్యాయమూర్తులకు వివరించారు. తొలుత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ అధికారుల వర్క్‌షాపునకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్‌కు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తులు, ఏలూరు బార్ అసోషియేషన్ సభ్యులు ఎ.విజయకుమార్, న్యాయవాదులు, తదితరులు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ వర్క్ షాపులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తులు పాల్గొన్నారు.

# రాజధానికి వైద్య విద్యార్థిని వైష్ణవి విరాళం

### పొలం అమ్మి రూ.25 లక్షలు అందజేత
### అమరావతికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియామకం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వైద్య విద్యార్థిని వైష్ణవి విరాళం అందించారు. ముదినేపల్లికి చెందిన అంబుల వైష్ణవి ఉండవల్లి నివాసంలో సిఎం చంద్రబాబునాయుడును శనివారం కలిసి విరాళం అందించారు. అమరావతి నిర్మాణానికి రూ.25 లక్షలు, పోలవరం ప్రాజెక్టుకు రూ.ఒక లక్ష చొప్పున విరాళం ఇస్తూ సిఎం చంద్రబాబుకు చెక్కు అందించారు. తమకున్న మూడు ఎకరాల భూమిలో ఎకరం అమ్మగా వచ్చిన రూ.25 లక్షలను రాజధానికి, తన బంగారు గాజులు అమ్మగా వచ్చిన రూ.ఒక లక్షను పోలవరానికి విరాళంగా అందించినట్లు వైష్ణవి తెలిపారు. రాజధానిని నిర్మిద్దాం, రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం అనే ఆలోచనతో పనిచేస్తున్న ప్రభుత్వానికి తనవంతుగా ఈ విరాళం ఇచ్చినట్లు ఆమె తెలిపారు. రాజధాని నిర్మాణం కోసం వైష్ణవి పొలం అమ్మి మరీ విరాళం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం విద్యార్థిగానే ఉన్న వైష్ణవి తండ్రి సహకారంతో రాజధాని కోసం, పోలవరం కోసం విరాళం ఇవ్వడం ఎంతో గొప్ప విషయమన్నారు. నేటి యువతకు వైష్ణవి ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఇలాంటి యువత కలలు తమ ప్రభుత్వం నిజం చేస్తుందని చంద్రబాబు అన్నారు. ఎటువంటి లాభాపేక్షలేకుండా చిన్న వయసులో ఇంత గొప్ప మనుసు చాటిన వైష్ణవిని సిఎం శాలువా కప్పి సత్కరించారు. స్ఫూర్తిదాయకంగా నిలిచిన వైష్ణవిని సిఎం అమరావతికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. వైష్ణవి విజయవాడలోని ఓ మెడికల్ కళాశాలలో ప్రస్తుతం ఎంబిబిఎస్ సెకండ్ ఇయర్ చదువుతుంది. ఈ సందర్భంగా వైష్ణవితో పాటు, ఆమె తండ్రి అంబుల మనోజ్‌ను సిఎం చంద్రబాబు అభినందించారు.

# బాధ్యతలు స్వీకరించారు.. భారాలు దించుతారా..!

**కేంద్రం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయి. మంత్రులు బాధ్యతలు సైతం స్వీకరించారు. ఎంఎల్ఎలు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్‌లో ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. అధికారుల బదిలీల పర్వం సాగుతోంది. అయితే ప్రజలు మాత్రం ఆర్థిక భారాలు ఎప్పటికి తగ్గిస్తారో.. సమస్యలు పరిష్కరించేదెప్పుడోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.**




పలు హామీలతో ఎన్నికల్లో విజయం సాధించిన ఆయా పార్టీల నేతలు కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వాలు ఏర్పాటు చేసి అధికారం చేపట్టారు. హామీల అమలు దిశగా అడుగులు ప్రారంభించారు. అయితే ప్రజల దైనందిన జీవితంలో కీలకమైన సమస్యలు మళ్లీ తెరపైకొచ్చాయి. గతంలో మాదిరిగా ఉల్లి ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ దీనిపై స్పందించి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి సబ్సిడీపై ఉల్లిపాయలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించడం సామాన్యులకు ఊరటనిచ్చే అంశం. అదే సమయంలో మిగిలిన కూరగాయల ధరలు కూడా తగ్గించేలా చర్యలు చేపట్టాలని, ఆయా కూరగాయలు ఎక్కడ తక్కువకు దొరుకుతాయో తెలుసుకుని అక్కడి నుంచి రప్పించి ప్రజలకు రైతుబజార్లలో అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఇదేరీతిన ఏలూరు జిల్లా అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు సైతం దృష్టి సారిస్తే ధరలు ఎంతోకొంత దిగొచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. నిత్యావసరాలు, ఇతర ధరల సంగతేమిటో పాలకులే చెప్పాలి. ఇక మున్సిపాల్టీల్లో చెత్త పన్ను భారాన్ని అధికారికంగా ఎప్పుడు తొలగిస్తారా అని పుర ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇక ధాన్యం సొమ్ము కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఓ పక్క సాగు ఖర్చులు, మరోపక్క పిల్లల ఫీజులు చెల్లించాల్సి ఉండడంతో రైతన్నలు ఆర్థికంగా సతమతమవుతున్నారు. ధాన్యం సొమ్ముతోపాటు రైతులకు టిడిపి కూటమి హామీ మేరకు రూ.20 వేలు పెట్టుబడి సాయం వెంటనే చెల్లించాలనేది చిన్న, సన్నకారు, మధ్యతరగతి, కౌలు రైతుల అభిలాష. ఉపాధి కూలీలు సైతం బకాయి వేతనాల కోసం ఆశగా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

చంద్రబాబు అధికారంలోకి రాగానే ఎన్నికల హామీ మేరకు ఐదు సంతకాలు పూర్తి చేశారు. వాటి ఆచరణ మిగిలింది. డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం వేలాది మంది బిఇడి, డిఇడి అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో టెట్, డిఎస్‌సికి సంబంధించి అభ్యర్థులు రుసుము చెల్లించి పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. టెట్ పరీక్షలు పూర్తయినా ఫలితాలు విడుదల చేయలేదు. టెట్ ఫలితాలు విడుదల చేయడంతోపాటు డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తే అభ్యర్థులకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టి వారం రోజులు కాకముందే గతంలో మాదిరిగానే ప్రతి సోమవారం పోలవరం రీతిగానే మొదటి సోమవారం పోలవరం పర్యటనకు విచ్చేశారు. పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష కూడా నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేదుగాని అధికారులు మాత్రం నాలుగు సీజన్లు అవసరమని చెబుతున్నారని తెలిపారు. అంటే నాలుగు సంవత్సరాల సమయం పడుతుందని తెలుస్తోంది. ఇంతవరకూ బాగానే ఉంది గానీ నిర్వాసితులకు పునరావాసం, పరిహారం గురించి ఎక్కడా చర్చించిన దాఖలాల్లేవు. మొన్నటి వరకూ పోలవరం పనులు, పునరావాసం సమాంతరంగా సాగాలని కూటమి నేతలే చెప్పేవారు. అయితే ఈ పర్యటనలో పెద్దగా నిర్వాసితుల అంశం ప్రస్తావనకు రాకపోవడం బాధాకరం. ఇప్పటికైనా నిర్వాసితుల పునరావాసం, పరిహారం అందజేతపై ముందు దృష్టి పెట్టి అది పూర్తయిన తర్వాతే పనులపై కేంద్రీకరించాలని అంతా కోరుతున్నారు. లేనిపక్షంలో మళ్లీ జులై, ఆగస్టు నెలల్లో వచ్చే వరదలకు ఏలూరు జిల్లాలోని రెండు మండలాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ మండలాలు ముంపునకు గురికాక తప్పదని ఆయా ప్రాంతాల ప్రజలు లబోదిబోమంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా అడుగులు వేస్తుందా.. లేక పాతరీతినే వ్యవహరిస్తుందో వేచిచూడాలి.

**- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్**

# నారాయణపురంలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద సమేత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఆర్‌సి తాడేపల్లిగూడెం, నేషనల్ కెరియర్ సర్వీస్ ఏలూరు జిల్లా వారి ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి మెగా జాబ్ మేళాకు 183 మందికి పైగా నిరుద్యోగులు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో వివిధ కంపెనీలకు 76 మంది ఎంపికైనట్లుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విశ్వేశ్వరరావు తెలిపారు. ఎంపికకు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా నారాయణ పురం గ్రామ సర్పంచి దిడ్ల అలకనంద శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం చిన్నదైనా నమ్మకంగా నిజాయితీగా పనిచేస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు అందిపుచ్చు కోగలం న్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవా లని చెప్పారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన ఏలూరు సిఇఒ మెహరాజ్ మాట్లాడుతూ ఎక్కువమందికి ఉపాధి కల్పించడం లక్ష్యంగా ఇటువ ంటి కార్యక్రమాలు ఏర్పా టు చేయనున్నట్లు చెప్పారు. ఒకేషనల్ ఆఫీసర్ వరలక్ష్మి మాట్లాడుతూ శ్రమను అర్థం చేసుకుని విద్యార్థులు బాధ్యతతో మెలగాలన్నారు. ఏలూరు జిల్లా యంగ్ ప్రొఫెషనల్ గట్టిం ప్రవీణ్‌కుమార్ మాట్లా డుతూ దేశంలోనే ప్రతిష్టాత్మక కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా జాబ్‌మేళా నిర్వహి స్తామని, కష్టపడే తత్వం కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్విని యోగం చేసుకో వాలని చెప్పారు. మోడల్ రిసోర్స్ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడు తూ ప్రతిభా సామర్థ్యం కలిగిన పేర్ల కోసం మల్టీ నేషనల్ కంపెనీలు ఎదురుచూస్తున్నాయన్నారు. సామ ర్థ్యాన్ని పెంపొందిం చుకునే దిశగా విద్యార్థులు ప్రయ త్నించాలన్నారు. వివిధ కంపెనీలకు చెందిన హెచ్ఆర్ మేనేజర్లు వారి కంపెనీల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలు, పని విధానం, పలు అంశాలను విద్యార్థులకు వివరించారు.

## రాయితీ ట్రాక్టర్లు వ్యవసాయ పనులకే వినియోగించాలి

### జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

ప్రభుత్వ రాయితీపై రైతులు తీసుకున్న ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు వ్యవసాయ పనులకు మాత్రమే వినియోగించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్‌కె.హబీబ్ బాషా హెచ్చరించారు. చింతలపుడి సబ్ డివిజన్ పరిధిలోని చింతలపుడి, లింగంపాలెం, కామవరపుకోట, టి.నరసాపురం మండలంలో సన్న, చిన్నకారు రైతులకు కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ద్వారా రాయితీపై ఇచ్చిన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై ఇచ్చిన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు వ్యవసాయ ఉనులకు మాత్రమే వినియోగించే విధంగా అధికారులు పర్యవేక్షించాలని నాలుగు మండలాల వ్యవసాయాధికారులను ఆదేశించారు. రైతులు వ్యవసాయానికి వినియోగించుకున్న తరువాత స్థానిక రైతులకు మార్కెట్ ధర కన్నా తక్కువ రేటుకు అద్దెకు ఇవ్వాలని రైతులకు సూచించారు. రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయనతో పాటు చింతలపూడి వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్, చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి.నరసాపురం మండలాల అధికారులు కె.మురళీకృష్ణ, కె.మీనాకుమారి, సిహెచ్.పవన్‌కుమార్, బి.సుమలత ఉన్నారు.

## వీధి కుక్కలను నిర్మూలించాలని వినతి

**ప్రజాశక్తి - చాట్రాయి**

మండలంలోని చిన్నంపేటలో వీధికుక్కలు స్వైరవిహారం చేసి ప్రజలపై దాడి చేస్తున్నాయని, వాటిని నిర్మూలించాలని కోరుతూ ఆ గ్రామస్తుడు కొమ్ము ఆనందం ఎంపిడిఒ మంగకుమారికి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజుల్లో మండలం మొత్తం మీద చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 40 మంది కుక్క కాటుకు గురైన కేసులు నమోదయ్యాయన్నారు. కొంతమందికి షుగర్ వ్యాధి ఉండడంతో కుక్కల దాడిలో అయిన గాయాలు మానక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తనకు 18 ఏళ్ల నుంచి షుగర్ వ్యాధి ఉందని, కుక్క కాటు గాయం మానడం ఆందోళన వ్యక్తం చేశారు. వీధి కుక్కలను నిర్మూలించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కుక్కల దాడిలో గాయపడినవారికి ఏదైనా ప్రమాదం సంభవిస్తే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

## టైలర్ల సంఘానికి రామకృష్ణారావు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

టిడిపి కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షులు జేష్ఠ రామకృష్ణారావు కుమారుడు పుట్టినరోజు సందర్భంగా కొయ్యలగూడెం విలియం హెూం గణపతిరామ టైలర్స్ అసోసియేషన్ సంఘం వారికి రామకృష్ణారావు రూ.50 వేల నగదును అందించారు. ఫిబ్రవరి 28వ తేదీన జరిగిన టైలర్స్ డే రోజున ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణారావు టైలర్ల స్థితిగతులను తెలుసుకొని, వారి అభివృద్ధికి టైలర్ల సంఘానికి రూ.50 వేలు అందిస్తానని తెలిపారు. ఆయన కుమారుడు శ్రీరామ్ పుట్టినరోజు సందర్భంగా ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న వినాయకుని ఆలయం వద్ద టైలర్ల సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం రామకృష్ణారావు తనయుడు పుట్టినరోజు కానుకగా రూ.50 వేల చెక్కును టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి చేతుల మీదుగా టైలర్ సంఘ అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజుకు, టైలర్ సంఘ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో మట్టా సూర్యచంద్రం, ముప్పిడి చిన్నబాబు, టిడిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు దొడ్డపనేని దుర్గాదేవి, కొత్త రమ, మధుబాబు, టైలర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# నేరాలు - ఘోరాలు

## బైక్‌ను ఢీకొన్న డిసిఎం వ్యాన్

### ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్**

ద్విచక్రవాహనాన్ని డిసిఎం వ్యాన్ ఢీకొన్ని ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని వేగవరం - చెల్లేరు రోడ్డులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన బంటుమిల్లి నాగరాజు, చంద్రు దేవా (22) ఇద్దరు కలిసి శనివారం ద్విచక్ర వాహనంపై పొగాకు పనుల నిమిత్తం తాడువాయి బయలుదేరారు. ఈ క్రమంలో వేగవరం - చెల్లేరు రోడ్డులో ఎదురుగా వస్తున్న వస్తున్న డిసిఎం వ్యాన్ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రు దేవా అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు నాగరాజును జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ జ్యోతిబస్సు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దేవా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

అనారోగ్యానికి గురైన కానిస్టేబుల్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఏలూరు నగరానికి చెందిన దాసరి మధుకుమార్ (38) 2013లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అప్పటి నుంచి పలు పోలీస్ స్టేషన్లలో ఆయన విధులు నిర్వహించాడు. ప్రస్తుతం ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన కొన్నిరోజులుగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. పలు ఆసుపత్రుల్లో ఆయనకు చికిత్స అందించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. పోలీస్ అసోసియేషన్ తరపున పోలీస్ బ్యాచిల తరఫున కూడా ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించేందుకు ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం కూడా ఆయన ఆరోగ్యం మెరుగుపడలేదు. శనివారం హఠాత్తుగా పరిస్థితి విషమంచటంతో ఏలూరు నగరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, ద్విచక్రవాహనాలు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. జీలుగుమిల్లి ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ములగలంపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు స్థావరంపై ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఆ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.50,050 నగదు, ఆరు ద్విచక్రవాహనాలు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**గోపవరంలో...**

**ముసునూరు :** పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపవరం గ్రామంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలోని దర్భగూడెంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ సిబ్బంది శనివారం పట్టుకున్నారు. విఆర్ఒ పాషా తెలిపిన వివరాల ప్రకారం... పాతపండువారిగూడెం సమీపంలోని వాగు నుంచి జంగా రాఘవరెడ్డి అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌పై లోడ్ చేసి వస్తుండగా దర్భగూడెం సమీపంలో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

## శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు

**ప్రజాశక్తి - ద్వారకాతిరుమల**

ద్వారకాతిరుమల శివాలయం రోడ్డులో ఉన్న బోరు నిమిత్తం నిర్మించిన శిలాఫలకంపై ఉన్న మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఫొటోలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై వైసిపి మండల శ్రేణులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శిలాఫలకం ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

### జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు విజయకృష్ణ

### మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరు పరిశీలన



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న విజయకృష్ణ

**ప్రజాశక్తి - కామవరపుకోట**

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండి పెట్టాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ వి.విజయకృష్ణ అన్నారు. మండలంలోని రావికంపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యంపియుపి పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును శనివారం ఆయన పరిశీలించారు. ఉదయం ఉన్నత పాఠశాలకు చేరుకుని తొలుత మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్న విద్యార్థుల సంఖ్య తదితర వివరాలు ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని యంపియుపి పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు చేరుకుని అక్కడి మధ్యాహ్న భోజన పథక అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాల చేరుకుని భోజన వితరణ జరిగే వరకు అక్కడే ఉండి విధానాన్ని గమనించారు. విద్యార్థులతో విడివిడిగా ముచ్చటించి పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, రుచి, మెనూ అమలు, నీటి లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది యూనిఫాంలో లేకపోవటం, స్టాకు, రికార్డులు సరిగా నిర్వహించకపోవటంపై విజయకృష్ణ అసహనాన్ని వ్యక్తపరిచారు. దీన్ని సరి చేసుకోవాలి సిబ్బందికి సూచించారు.

# ఉపాధి హామీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

### ఎస్ఆర్‌పి సూర్యచక్ర


మాట్లాడుతున్న ఎస్ఆర్‌పి సూర్యచక్ర

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

ఉపాధి హామీ చట్టం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎస్ఆర్‌పి సూర్యచక్ర అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో శనివారం ఉపాధి హామీ చట్టం సోషల్ ఆడిట్ కో-ఆర్డినేటింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచక్ర మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడేవారి విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో ఆదివారం నుంచి డిఆర్‌పిలు గ్రామాల్లో ఉపాధి కూలీలు పనిచేసిన ప్రాంతాల్లో సామాజిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. పనుల్లో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా పనులు నిర్వహిస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యాప్తంగా జరిగే సామాజిక తనిఖీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లయితే వారి నుంచి సొమ్మును తిరిగి రికవరీ చేస్తామన్నారు. సామాజిక తనిఖీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు డిఆర్‌పిలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ, మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి రమణ బాబు, ఎపిఒలు నాగరాజు, దయానందరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# సిహెచ్‌సికి దాతల సాయం అభినందనీయం

### పర్యవేక్షకులు, వైద్యులు సునీత


సిహెచ్‌సిలో తాగునీటి ఫిల్టర్ ప్రారంభిస్తున్న వక్తలు

**ప్రజాశక్తి - భీమడోలు**

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం ప్రభుత్వం కల్పిస్తున్న వసతులకు అదనంగా దాతలు మరిన్ని వసతులను కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమని సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్రాంత న్యాయ కార్యదర్శి వట్టి వీర వెంకట సత్యనారాయణ శత జయంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం ఆయన కుమారులు, స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు యూనిట్ అధ్యక్షులు వట్టి సుగుణాకర్ భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి గంటకు వంద లీటర్ల సామర్థ్యంతో శుద్ధిచేసిన జలాలను తాగునీటిగా అందించే ఫిల్టర్‌ను, ఇదేవిధంగా సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయులు మండే సుధాకర్ పనిచేసే జెఎంఎంపురం ఎంపిపి ప్రాథమిక పాఠశాలకు రూ.వేల విలువైన ఫర్నీచర్‌ను కేటాయించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, జెఎంఎంపురం పాఠశాలకు కేటాయించిన ఫిల్టర్, ఫర్నీచర్‌ను ఆయా సంస్థల బాధ్యులు డాక్టర్ ఎన్.సునీత, మండే సుధాకర్లకు వట్టి సుగుణాకర్ మానవత సంస్థ, భీమడోలు యూనిట్ ఆధ్వర్యంలో శనివారం అందించారు. ఫిల్టర్ యూనిట్‌కు మానవత జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పక రాంబాబు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న సేవలను మరింత విస్తృత పరిచేందుకు అవసరమైన ఇతర సౌకర్యాలు, ఇప్పటికే ఉన్న యూనిట్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి సామాజిక ఆరోగ్య కేంద్రం తరపున ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు దృష్టికి తెచ్చామని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి గంగాధరరావు, తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, భీమడోలు యూనిట్ సభ్యులు జి.రమణశంకర్, పంచకర్ల సత్యనారాయణ, గంధం వెంకట్రావుతోపాటు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అశ్విని, డాక్టర్ ఆనంద్, డాక్టర్ రష్మీ పాల్గొన్నారు.

# ఎండపల్లిలో ఏరువాక పూర్ణిమ వేడుక


ఏరువాక పూర్ణిమ వేడుకలో రైతులు

**ప్రజాశక్తి - చింతలపూడి**

మండలంలోని ఎండపల్లి గ్రామంల్లో ఏరువాక పూర్ణిమ వేడుక జెడి ఫౌండేషన్, అబ్దుల్‌కలాం యూత్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌కలాం యూత్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షులు మరికంటి గోపాలకృష్ణ మాట్లాడుతూ తొలకరి జల్లుల ఆగమనంతో రైతులు ఆనందోత్సాహాల మధ్య అరక దున్నటంతో పొలం పనులు మొదలుపెడతారన్నారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలన్నారు. నాగరికత ఎంత ముందుకు సాగినా నాగలి కదలనిదే ఆ నాగరికతకు పరమార్థం ఉండదన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి డిపిఎం తాతరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా అదనపు డిపిఎం మహబూబ్ మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లక్ష్మీనారాయణ కృషి చేస్తున్నారన్నారు. గత ఐదేళ్లుగా తాము ఏరువాక పండుగను సాంప్రదాయ రీతిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం రైతులను సన్మానించి నూతన వస్త్రాలు అందించారు.

# విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేత


టి.నరసాపురం : ఎంపిపి వెంకటేశ్వరరావు, జనసేన నేత నాగరాజు

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మాజీ ఎంపిపి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం ఉన్నత పాఠశాలలో శనివారం జనసేన మండలాధ్యక్షుడు అడపా నాగరాజుతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు విద్యార్థుల కోసం పాఠశాలల్లో మౌలిక సదుపా యాలు కల్పించేందుకు పెద్దపీట వేస్తారన్నారు. ఉపాధితో కూడిన విద్యకు ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తోట శ్యామల, టిడిపి, జనసేన నాయకులు గండబోయిన శ్రీను, కాల్నీడు రాంబాబు, కంపసాటి రమేష్, ఇమామ్, ప్రధానోపాధ్యాయుడు ఆలీ పాల్గొన్నారు.

**నూజివీడు :** మండలంలోని పాత రావిచర్ల గ్రామంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంపిటిసి సభ్యులు మరీదు శివనాగమణి, టిడిపి గ్రామ అధ్యక్షులు కొన్నంగుంట రమేష్ బాబు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొణతం సాంబశివరావు, మరీదు చెన్నకేశవరావు, కొణతం మారయ్య బాబు, తోట సీతారామరాజు, లావు ప్రసాద్, జనసేన పాత రావిచర్ల నాయకులు పాల్గొన్నారు.

**చింతలపూడి :** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు రానున్న రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు పాఠశాలల్లో అమలు చేయబోతున్నారని జనసేన చింతలపూడి అధ్యక్షులు చిదరాల మధుబాబు, చింతలపూడి నగర పంచాయతీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం అన్నారు. చింతలపూడిలోని మేడబడిలో ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమంలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐ టిడిపి చిం తల పూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులకు ఇచ్చే బ్యాగుల మీద సైతం వైసిపి రంగులు ఉన్నాయని, అవి తీసేయించడానికి దాదాపు రూ.2.50 కోట్లు వృధా అవుతుందనే ఆలోచనతో ఆ రంగులు ఉన్న బ్యాగులను పంపిణీ చేసేయాలని చంద్రబాబు ఆదేశా లు ఇవ్వడం ప్రజా ప్రభుత్వ పాలనకు నిదర్శనమ న్నారు. ఈ కార్యక్రమంలో రైతు జిల్లా కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, బిజెపి నాయకులు తోట నారాయణరావు, జనసేన నాయకులు అర్నేపల్లి అప్పారావు, ఎజిఎస్.కుమార్, మధు, కంభం రమేష్ పాల్గొన్నారు.


ముసునూరు : పుస్తకాలు అందిస్తున్న ఎంపిటిసి, టిడిపి నేతలు

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

### 24న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి

### ఎపి రైతు సంఘం

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24వ తేదీన కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యా దుల పరిష్కార కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందిం చాలని ఎపి రైతు సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమా వేశం నిర్ణయించింది. ఈ సమావేశం స్థానిక అన్నే భవనంలో సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సం ఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ధా న్యం అమ్మిన అన్నదాతలకు ధాన్యం బకాయి సొమ్ములు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పెట్టుబడులకు సొ మ్ములు లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు నిధులు విడుదల చేసి వాస్తవ సాగుదారులకు అందిం చాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం లో భూములు కోల్పోయిన రైతులకు ప్రయివేట్ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి ఆదుకోవాలని, ఆ తర్వాత చిం తలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి మెట్ట ప్రాం త రైతులకు సాగునీరు అందించాలని కోరారు. కొబ్బరి, ఆయి ల్ పామ్, నిమ్మ, అరటి, పాడి తదితర రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కౌలు రైతులకు వెంటనే గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీ లేని పంట రుణాలు అందిం చాలని కోరా రు. 24వ తేదీన కలెక్టర్‌కు వినతిపత్రం అందిం చే కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశం లో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కన్నాపురంలో 'బడిబాట'

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కొయ్యలగూడెం పరిధిలో మండలంలోని కన్నాపురం గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా మన అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నయోమిరాణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఆటపాట ద్వారా విద్యను అందించి, సమగ్ర అభివృద్ధి చేసి ఐదేళ్లు నిండిన తర్వాత పైచదువులకు పంపించేందుకు అంగన్వాడీ కేంద్రం నుంచి ధ్రువపత్రం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్లు శారద, ప్రభావతి, గంగారత్నం, వరలక్ష్మి, మినీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

మండలంలోని దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన యాతం నాగేశ్వరరావు భార్య యాతం నాగమణి బ్రెస్ట్ కేన్సర్‌తో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మానవత సంస్థ వారు ఆమెకు మందుల నిమిత్తం రూ.మూడు వేలు, మానవత సభ్యులు గిద్దె మోహన్‌రావు రూ.500 కలిపి మొత్తం రూ.3,500 శనివారం ఉదయం ఆ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రెసిడెంట్ బొమ్మ మోహన్‌రావు, మందపాటి రామకృష్ణ, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, తిగిరిపల్లి చంటి, కాలింగి సత్యనారాయణ, ముప్పిడి వెంకట్రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## 'వైసిపి కార్యకర్తలు అధైర్యపడొద్దు'

**కామవరపుకోట :** వైసిపి కార్యకర్తలు అధైర్య పడొద్దని, సమన్వయంతో ధైర్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. కామవరపుకోట చెక్‌పోస్ట్ సమీపంలోని వైసిపి మండల కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ రాజకీయంలో గెలుపోటములు సహజమని, కార్యకర్తలు ఈ ఫలితాలను తేలికగా తీసుకొని పార్టీ పటిష్టతకు సమిష్టిగా కలిసి రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలన్నారు.

## పంచాయతీ కార్యాలయాల్లో ఎంపిడిఒ తనిఖీలు

**ప్రజాశక్తి - పోలవరం**

మండలంలోని కొండ్రుకోట సచివాలయ పంచాయతీ కార్యాలయాలును ఎంపిడిఒ జి.శ్రీను శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పనితీరు, రికార్డుల నిర్వహణ, సచివాలయ సిబ్బంది హాజరుచ పనితీరు పరిశీలించారు.

## ప్రగడపల్లిలో డ్రెయినేజీ పూడికతీత పనులు

**ప్రజాశక్తి - పోలవరం**

మండలంలోని ప్రగడపల్లి గ్రామంలో సర్పంచి కలుం బాపిరాజు ఆధ్వర్యంలో డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టారు. నిల్వ ఉన్న వర్షపు నీరు బయటకు వెళ్లేందుక డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టి తూరను అమర్చి మురుగునీరు, వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గాన్ని శనివారం ఏర్పాటు చేశారు. అనంతరం వాటర్ ట్యాంకు నుంచి గ్రామంలోకి వెళ్లే పైపు లైన్ లీక్ అవడంతో త్వరితగతన లీకులను సరిచేసి ప్రజలకు సకాలంలో నీరందే విధంగా సర్పంచి చర్యలు తీసుకున్నారు. చేస్తున్న పనులను సర్పంచి కలుం బాపిరాజు, సెక్రటరీ యు.రాజారావు పర్యవేక్షించారు.

## ఐనంపూడిలో అన్నసమారాధన

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలోని ఐనంపూడి గ్రామంలో జరుగుతున్న బలుసులమ్మ తల్లి జాతర మహోత్సవాలు శనివారంతో రెండో రోజుకు చేరాయి. బలుసులమ్మ మహోత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని టిడిపి నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహరావు, శ్రీహరిపురం సర్పంచి పరసా విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వీరిని సత్కరించారు. బలుసులమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం జరిగే జాతరతో ముగియనున్నాయి.

### CHANGE OF NAME

I, **KARIMSETTI MOULIKA** W/o. Karna Rajesh, D.No. 8-3-24, Sri Sai Sadan, Mogaltur Road, Narasapuram, Narasapuram Mandal, W.G.Dt. A.P. I have changed my name from **MOULIKA KARNA** (Old name) to **KARIMSETTI MOULIKA** (New name) hence forth I am being called **KARIMSETTI MOULIKA**, W/o. Karna Rajesh, for all purposes.

### పాస్‌పోర్టు పడిపోయినది

ప॥గో॥జిల్లా, పెనుమంట్ర మండలం, పెనుమంట్ర గ్రామ కాపురస్తురాలు నరాలశెట్టి లక్ష్మి, భర్త: సూరిబాబు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు నెం. **R2316818** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియజేయలరు.

అడ్రస్: నరాలశెట్టి లక్ష్మి
W/o. సూరిబాబు, డోర్ నెం. 5-32/ఎ
హైస్కూల్ రోడ్డు, పెనుమంట్ర
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా
పిన్: 534124, సెల్: 8374234115

### మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

**O.S. No. 324/2022** in **I.A. No. 918/2022**

*Plaintiff (వాది):* షేక్ ఖాద్ భీ

*Defendant (ప్రతివాది):* బండారు వీర వెంకట సత్య నాగరాజు అలియాస్ నాగరాజు

పై నంబర్ దావాలో సదరు వాది మీకు నోటీసులను కోర్టు మరియు పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు పంపిన మీరు తీసుకొనక తప్పించుకొనుచున్నారు. మీరు **ది. 21-06-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని మీ యొక్క ఆక్షేపణలను తెలియచేసుకొనవలెను. లేని యెడల సదరు నంబరు దావా న్యాయస్థానం వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

*(By Order of the Hon'ble Court)*

**VEMULA MURALI (VML),** Advocate
Bhimavaram Bhimavaram
Date: 18-06-2024 Cell: 7989068025

### దస్తావేజు పోయినది

నా క్లయింట్ ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, రాజులకాలనీ, డోర్‌నెం.10-2-56/6 విజయ 2 అపార్ట్ మెంట్‌కు చెందిన అతుకూరి నాగలక్ష్మి, W/o.సత్యనారాయణ గారు నాకు ఇచ్చిన సంజాయిషి ప్రకారం తెలియజేయునది ఏమనగా.. నా క్లయింట్ జంగారెడ్డిగూడెంలో ఆర్.ఎస్. నెం.438 మరియు 484 రాజులకాలనీలో విజయ అపార్ట్‌మెంట్-2లో చ॥గ॥40.33లు విస్తీర్ణంలో ఫ్లాట్‌ను పలివేల యశోద, W/o.శ్రీను వద్ద నుండి 28-02-2024 తేదీన కొనుగోలు చేసి జంగారెడ్డిగూడెం ఎస్ఆర్ఒలో డాక్యుమెంట్ నెం.7072/2024గా నమోదు చేయడమైనది. దీని తాలుకు ఒరిజినల్ లింకు డాక్యుమెంట్స్ నెం.5083/2009 తేది.26-10-2009 అండ్ 5084/2009 తేది 26-10-2009 ఈ డాక్యుమెంట్స్ జిరాక్స్ నిమిత్తం జంగారెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్‌కి 14-06-2024 తేదీన వెళ్లి వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.

సదరుపైన తెలిపిన ఒరిజినల్ లింకు దస్తావేజులు మరియు ఒరిజినల్ లింకు దస్తావేజులకు సంబంధించిన ఆస్తిపై ఋణము మంజూరు చేయుటకు గాను, బ్యాంకు/ఫైనాన్స్ సంస్థల సంబంధిత కార్యక్రలాపాలు, వ్యవహారముల యందు ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు ఆక్షేపణలు క్లయిములు వున్న యెడల ఈ క్రింది అడ్రస్ గల వారికి వ్రాత పూర్వకముగా రిజిస్టరు పోస్ట్ ద్వారా ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోగా తెలియపరచవలెను. లేనిచో సదరు విషయములలో ఎటువంటి ఆక్షేపణలు లేని నిర్వివాద నిష్పేచ్ఛి గల ఆస్తిగా భావించి బ్యాంకు/ఫైనాన్స్ సంస్థ వారు ఋణమును మంజూరు చేయుదురు. సదరు గడువు తదుపరి వచ్చు ఆక్షేపణలు గాని అభ్యంతరములు గాని బ్యాంకు వారు పరిగణనలోనికి తీసుకోరనియు మరియు అట్టివి ఏమియూ బ్యాంకు/ఫైనాన్స్ సంస్థ వారిని బైండు చేయవని తెలియపరచడమైనది.

**BUDIGINA NARENDRA KUMAR**
Advocate & Notary
Dt.21-06-2024 Jangareddygudem. Cell: 9440314862